ప్లాంటేషన్‌కు నర్సరీలు సిద్ధం

- ప్రతీ గ్రామంలో ప్రారంభం
- మండల వ్యాప్తంగా 92,400 మొక్కలు నాటేందుకు చర్యలు



నడికూడ నర్సరీలో మొక్కలు



కంఠాత్మకూరులో..

నడికూడ : రాష్ట్ర ప్రభుత్వం వనమహోత్సవం పేరుతో మొక్కలను నాటి, పెంచేందుకు ఎంతో కృషి చేస్తుంది. వనమహోత్సవంలో తెలంగాణ రాష్ట్రంలో అడవుల విస్తీర్ణం పెంచేందుకు కార్యక్రమాలు చేపడుతుంది. గతంలో నాటేందుకు అవసరమైన మొక్కలు మండలంలో ఒకటి, రెండు నర్సరీలు మాత్రమే ఏర్పాటు చేసి వాటిలో మొక్కలను పెంచేవారు. ప్రస్తుత్తం మండంలోని ప్రతి గ్రామంలో నర్సరీలను ప్రారంభించారు.

92 వేలకు పైగా మొక్కలు నాటడమే లక్ష్యం

మండలవ్యాప్తంగా ఉన్న 15 గ్రామాల్లో 11వ విడత వనమహోత్సవంలో మండలంలోని నర్సరీలో 92,400 మొక్కలు నాటడమే లక్ష్యంగా అధికారులు చర్యలు చేపడుతున్నారు. మండలంలోని మేజర్ గ్రామాలైన నడికూడ, చర్లపల్లి, వరికోల్ గ్రామాల ఒక్కో నర్సరీలో 8,800 మొక్కలు పెంచనున్నారు. అలాగే చౌటుపర్తి, కౌకొండ, నార్లపూర్, ముస్త్యాలపల్లి, వెంకటేశ్వర్లపల్లి గ్రామాల్లోని నర్సరీలో 5,500 మొక్కలు, కంఠాత్మకూరు నర్సరీలో 7,700 మొక్కలు, పులిగిల్ల, రాయపర్తి, నర్సక్కపల్లె గ్రామాల్లో 6,600, ధర్మారం, సర్వపూర్ గ్రామాల నర్సరీలో 3,300 , రామకృష్ణపూర్ నర్సరీలో 4,400 మొక్కలను పెంచేందుకు ఏర్పాట్లు చేశారు. మండలంలోని పలు గ్రామాల్లో మొక్కలను నాటేందుకు స్థలాలను ఎంపిక చేయడం, అవెన్యూ ప్లాంటేషన్, రోడ్డుకిరువైపులా మొక్కలను నాటేందుకు అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. నర్సరీలో ఉపయోగపడే పండ్ల, పూల మొక్కలతో పాటు కానుగ, వేప, చింత తదితర మొక్కలను పెంచుతున్నారు. వనమహోత్సవానికి అవసరమైన మొక్కలు సిద్ధంగా ఉన్నాయని సంబంధిత సిబ్బంది చెబుతున్నారు.

నర్సరీల్లో మొక్కలు సిద్ధం



ప్రతి గ్రామంలో ఒక నర్సరీని ఏర్పాటు చేశాం. ప్రతీ ఒక్కరూ మొక్కలను పెంచి, తమ చుట్టు ఉన్న పరిసరాలను పచ్చదనంతో నింపాలనే కార్యక్రమాన్ని వ్యక్తిగత బాధ్యతగా స్వీకరించాలని అవగాహన కల్పిస్తున్నాం. ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతోనే వనమహోత్సవాన్ని విజయవంతం చేస్తాం.

– విద్యావతి, ఏపీఓ

ప్రజల భాగస్వామ్యం ముఖ్యం



అధికారుల సూచన మేరకు మా గ్రామ నర్సరీలో ఏడు వేలకు పైగా వివిధ రకాల మొక్కలను ప్లాంటేషన్ కోసం సిద్ధం చేస్తున్నం, గ్రామస్తుల సహకారంతో నాటిన ప్రతీ మొక్కను కాపాడే ప్రయత్నం చేస్తున్నం. ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యం.

– భార్గవి, జీపీ కార్యదర్శి, కంఠాత్మకూరు

క్లుప్తంగా

రైతులకు మెరుగైన సేవలు అందించాలి



గ్రోమోర్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏఓ కవిత

వేలేరు : గ్రోమోర్ కేంద్రం ద్వారా మండలంలోని రైతులకు మెరుగైన సేవలను అందించాలని మండల వ్యవసాయాధికారి కవిత అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో నూతన గ్రోమోర్ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు గ్రోమోర్ కంపెనీ ద్వారా నాణ్యమైన ఎరువులు, విత్తనాలు అందించాలని సూచించారు. గ్రోమోర్ కేంద్రం సేవలు ఎల్లప్పుడు రైతులకు అందుబాటులో ఉంటాయని, సద్వినియోగం చేసుకోవాలని కంపెనీ ప్రతినిధులు కోరారు. కార్యక్రమంలో ఏఈఓ రాజశేఖర్, గ్రోమోర్ కంపెనీ ఏరియా మేనేజర్ శరత్‌బాబు, ధర్మసాగర్, వేలేరు కేంద్రాల మేనేజర్లు రాజిరెడ్డి, రజనికుమార్, మాజీ సర్పంచ్ మాధవరెడ్డి, జుర్రు సంపత్ తదితరులు పాల్గొన్నారు.

'బీసీలను అన్ని పార్టీలు వాడుకుని వదిలేస్తున్నాయి'

ఐనవోలు : బీసీలను అన్ని రాజకీయ పార్టీలు వాడుకుని వదిలేస్తున్నాయని తీన్మార్ మల్లన్న టీం సభ్యుడు ఆరెల్లి రాము గౌడ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ ప్రతి పార్టీలో బీసీలు కష్టపడి పనిచేస్తారన్నారు. కష్టపడి పనిచేసిన బీసీలకు పదవుల విషయంలో తీవ్ర అన్యాయం జరుగుతందని వాపోయారు. బీసీలకు జనాభా ప్రాతిపదికన వచ్చే రిజర్వేషన్ శాతాన్ని వెంటనే అమలు చేయాలన్నారు. బీసీలకు అన్యాయం చేసే పార్టీలను గుర్తించి రానున్న ఎన్నికల్లో బుద్ధిచెబుతామని హెచ్చరించారు.

ఇద్దరిపై కేసు నమోదు

పరకాల : అంగన్‌వాడీ కేంద్రంలో అర్ధరాత్రి మద్యం తాగుతూ అక్కడే బీరు సీసాలు పగలగొట్టి చిన్నారులకు, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు, సిబ్బందిని ఇబ్బందులు పెడుతున్నాడనే ఫిర్యాదు మేరకు బీఆర్ఎస్ కార్యకర్త గొట్టి అనిల్‌తో పాటు మరొకరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ క్రాంతికుమార్ మాట్లాడుతూ ఎవరైనా వ్యక్తులు రాత్రివేళలోనే కాకుండా పగలు సమయంలో కూడా గ్రామాల్లో ఎక్కడ పడితే అక్కడ మద్యం సేవించి గ్రామస్తులను, మహిళలను ఇబ్బందులు పెడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

బ్రిడ్జి నిర్మాణంతో రాకపోకలకు అంతరాయం



బ్రిడ్జి వద్ద గ్రావెల్ లెవెలింగ్ చేస్తున్న దృశ్యం

నడికూడ : మండంలోని గొల్లపల్లి వద్ద నూతనంగా నిర్మిస్తున్న బ్రిడ్జి పనులు పూర్తి కావస్తున్నాయి. గ్రావెల్ లెవెల్ కోసం చేస్తుండడంతో సుమారు వారం రోజుల పాటు మండల కేంద్రం నుంచి వరంగల్, హనమకొండకు వెళ్లే వాహనదారులు తీవ్రఇబ్బందులు పడుతున్నారు. వరంగల్, హనుమకొండ నుంచి వచ్చే వాహనాలు వయా శనిగరం లేదా వెల్లంపల్లి క్రాస్,నర్సక్కపల్లి మీదుగా రావాలని, గొల్లపల్లి రోడ్డుపై నుంచి కేవలం ద్విచక్ర వాహనాలకు మాత్రమే రాకపోకలకు వీలుంటుందన్నారు. బ్రిడ్జి నిర్మాణం చేపట్టి ఇబ్బందులను తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.

త్రిశూల్‌కు ఘన నివాళి



త్రిశూల్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

శాయంపేట : మండల కేంద్రానికి చెందిన మామిడి త్రిశూల్ అనారోగ్యంతో మృతి చెందగా విషయం తెలుసుకున్న మాజీ ఎంపీపీ మెతుకు తిరుపతి రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంగుల మనోహర్‌రెడ్డిలు శుక్రవారం త్రిశూల్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం త్రిశూల్ కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారి వెంట నాయకులు మారెపల్లి నందం, రాంశెట్టి లక్ష్మారెడ్డి, మారెపల్లి మోహన్, వెంకటేశ్వర్లు, రాజేందర్, కిష్టయ్య, కరణ్ బాబు, మహేందర్, రాజు, తదితరులు ఉన్నారు.

బకాయిలను చెల్లించాలి

హన్మకొండ అర్బన్: జిల్లాలో గత మూడేళ్లుగా బెస్ట్ అవైలబుల్ పథకం కింద విద్యార్థులకు చెల్లించాల్సిన రూ.3.34 కోట్లకు పైగా ఫీజు బకాయిలను వెంటనే చెల్లించాలని దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు నా యకులతో కలిసి హనుమకొండ డీఆర్‌ఓ వైవీ.గణేష్‌ను శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు.

ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్

- గ్రామీణ పేదల సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు సమ్మయ్య

శాయంపేట : ప్రజల సమస్యలను పరిష్కరించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తుందని గ్రామీణ పేదల సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు పొన్నాల సమ్మయ్య అన్నారు. స్థానిక తహసీల్ కార్యాలయంలోని తహసీల్దార్ కల్వల సత్యనారాయణకు ప్రజా సమస్యలపై శుక్రవారం గ్రామీణ పేద సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలభిస్తుందన్నారు. రాష్ట్రంలో ఆరు గ్యారెంటీల పేరుతో అధికారంలోకి వచ్చినా ఇప్పటి వరకు ప్రజల సమస్యలను పరిష్కరించకుండా ప్రజల్ని మోసపూరిత వాగ్దానాలతో మోసం చేస్తూ కాలం వెల్లబుచ్చుతున్నారని దుయ్యపట్టారు. కార్యక్రమంలో టీపీడీఆర్ ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు మార్క వెంకటయ్య, గ్రామీణ పేద సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యదర్శి మొగిలిచర్ల వీరస్వామి, భూపాలపల్లి జిల్లా కార్యదర్శి సిరిపెల్లి రాజయ్య, నాయకులు కోటేశ్వర్ పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ భూములకు రక్షణ కల్పించాలి



ఆత్మకూరు : తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఆత్మకూరు : ఎస్సీ, ఎస్టీ భూములకు రక్షణ కల్పించాలని గ్రామీణ పేదల సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు సమ్మయ్య డిమాండ్ చేశారు. తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం తహసీల్దార్ జగన్మోహన్‌రెడ్డికి గ్రామీణ పేదల సంఘం నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇనాం భూములకు పట్టాలు ఇవ్వాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఓపీడీఆర్ ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మార్క వెంకటయ్య, ఉమ్మడి జిల్లా గ్రామీణ పేదల సంఘం కార్యదర్శి మొగిలిచర్ల వీరస్వామి, భూపాలపల్లి జిల్లా కార్యదర్శి రాజయ్య, జిల్లా నాయకుడు సంగాల కోటేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతపై దృష్టి సారించాలి

- పీహెచ్‌సీ డాక్టర్ రాధాశాంతిప్రియ



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ రాధాశాంతిప్రియ

దామెర : విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని పీహెచ్‌సీ డాక్టర్ రాధాశాంతిప్రియ సూచించారు. మండలంలోని ఒగ్లాపూర్ సమీపంలోని ఎస్‌బీఐటీలోని ఎంజేపీ, సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అనంతరం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చేతులను శుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. అపరిశుభ్రం కారణంగా వ్యాధులు సోకే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. సీజనల్ వ్యాధులపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వెల్లడించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు శ్రీకాంత్, భాగ్యలక్ష్మీ, ఏఎన్ఎం భారతి, విద్యార్థులు పాల్గొన్నారు.

జీపీ సిబ్బందిని అరెస్ట్ చేయడం సరికాదు

- సంఘం జిల్లా అధ్యక్షుడు పెంబర్తి రాజు



శాయంపేట: పోలీస్‌స్టేషన్‌లో ముందస్తు అరెస్ట్ అయిన గ్రామ పంచాయతీ సిబ్బంది



వేలేరు: కార్మికులను ముందస్తు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించిన పోలీసులు

శాయంపేట : గ్రామ పంచాయతీ సిబ్బందిని అక్రమంగా అరెస్ట్ చేయడం సరికాదని జీపీ సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు పెంబర్తి రాజు అన్నారు. హైదరాబాద్‌లోని పంచాయతీ రాజ్‌కమిషనర్‌ను శుక్రవారం జీపీ సిబ్బంది ముట్టడి కార్యక్రమం తలపెట్టగా ప్రభుత్వం ముందస్తుగా మండలంలోని అన్ని గ్రామాల్లోని సిబ్బందిని పోలీసులతో అరెస్ట్ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బందికి మూడు నెలల వేతనాలు ఇవ్వాలని అయినా వారు నిత్యం గ్రామప్రజలకు, ప్రభుత్వ అధికారులకు అందుబాటులో ఉంటూ పని చేస్తున్నారని తెలిపారు. చాలీచాలని వేతనాలతో కుటుంబాలను పోషించలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం రూ. 25వేల వేతనం ఇవ్వాలని, జీపీ సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. అరెస్ట్ అయిన వారిలో జీపీ ఉద్యోగుల సంఘం మండల ప్రధాన కార్యదర్శి మస్కే చేరాలు, ఉపాధ్యక్షుడు అకినపల్లి యాకయ్య, నాయకులు కరుణాకర్, రమేష్, భిక్షపతి, బత్తుల రమేష్, భిక్షపతి, రాజు, సూర్యప్రకాశ్ తదితరులు ఉన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల ముందస్తు అరెస్ట్

వేలేరు : తమ డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమానికి తరలివెళ్లడానికి సిద్ధంగా ఉన్న గ్రామ పంచాయతీ కార్మికులను పోలీస్‌లు ముందస్తు అరెస్ట్ చేశారు. మండలంలోని వివిధ గ్రామాల కార్మికులను ఎక్కడికక్కడ అరెస్టులు చేసి స్టేషన్‌కు తరలించారు. అరెస్టయిన వారిలో భద్రయ్య, ఆనందం, వీరన్న, భద్రయ్య, భాగ్య, ప్రమీల ఉన్నారు.

కమలాపూర్‌లో కొండచిలువ కలకలం



కొండచిలువను పట్టుకున్న అటవీ శాఖ, జూపార్కు సిబ్బంది

కమలాపూర్ : స్థానిక హెచ్‌పీసీఎల్ గ్యాస్ ప్లాంట్‌లో భారీ కొండచిలువ కలకలం రేపింది. ఎప్పుడు, ఎక్కడి నుంచి వచ్చిందో తెలియదు గానీ గ్యాస్ ప్లాంట్‌లోని ఓ గోదాంలోకి చొరబడింది. శుక్రవారం గోదాంలోకి వెళ్లిన సిబ్బందికి కొండచిలువ కనిపించడంతో భయభ్రాంతులకు గురైన సిబ్బంది ప్లాంట్ ఉన్నతాధికారులతో పాటు అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. వారు చాకచక్యంగా కొండచిలువను పట్టుకుని ఓ డ్రమ్ములో బంధించారు. ఎఫ్ఆర్ఓ శిరీష, డిప్యూటీ ఆర్ఓ ప్రిసిల్ల ఆదేశాల మేరకు అటవీశాఖ బీట్ ఆఫీసర్ అశోక్, జూపార్కు సిబ్బంది కృష్ణ, స్వామి, మల్లారెడ్డి హుటాహుటిన గ్యాస్ ప్లాంట్‌కు చేరుకుని సుమారు 9 అడుగుల భారీకొండ చిలువను స్వాధీనం చేసుకుని అటవీ ప్రాంతానికి తీసుకెళ్లి వదిలేశారు. గత కొంత కాలంగా కమలాపూర్, గూడూరు శివారు ప్రాంతాల్లోని ఎస్సారెస్పీ కాల్వ పరిసర ప్రాంతాల్లో కొండచిలువలు తరచూ సంచరిస్తున్నాయన్నారు. దీంతో తాము తీవ్ర భయాందోళనలకు గురవుతున్నామని, కొండచిలువలు ఈ ప్రాంతంలో సంచరించకుండా పట్టుకెళ్లాలని స్థానికులు, రైతులు కోరుతున్నారు.

నంబర్ ప్లేట్లు లేకుండా వాహనాలు నడిపితే సీజ్

కాజీపేట: కాజీపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో నంబర్ ప్లేట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడిపితే వాటిని సీజ్ చేయడంతో పాటు వాహనదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని కాజీపేట ఇన్‌స్పెక్టర్ వెంకన్న హెచ్చరించారు. కాజీపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అదాలత్ సెంటర్‌లో పలువురు వాహనదారులకు సీఐ శుక్రవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. మారిన నూతన చట్టాలకు అనుగుణంగా వాహనానికి సంబంధించిన అన్ని పత్రాలను వాహనదారులు తమ దగ్గర ఉంచుకోవాలని అన్నారు. నంబర్ ట్యాంపరింగ్ చేసి దొరికితే కఠిన చర్యలు తప్పవని పేర్కొన్నారు. ప్రత్యేక తనిఖీలు చేపట్టి అలాంటి వాళ్ల ఆటకట్టిస్తామని హెచ్చరించారు.

అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలి

- బీజేపీ మండల అధ్యక్షుడు రామోజు శ్రీనివాస్



ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

ఎల్కతుర్తి : అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని బీజేపీ మండల అధ్యక్షుడు రామోజు శ్రీనివాస్ అన్నారు. అర్హులైన వారికే ఇళ్లు కేటాయించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం భీమదేవరపల్లి మండల ప్రజాపరిషత్ కార్యాలయం ఎ దుట బీజేపీ నాయకులు ధర్నా చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్లు అర్హులైన వారికి కాకుండా కాంగ్రెస్ నాయకుల సన్నిహితులకే కేటా యిస్తున్నారని ఆరోపించారు. అధికారులను వదిలి ఇందిరమ్మ కమిటీలకు ఎలా అప్పగిస్తారని ప్రశ్నించారు. అనంతరం ఎంపీడీఓ వీరేశంకు వినతిపత్రం అందజేశారు. బీజేపీ జిల్లా కౌన్సిల్ మెంబర్ పృథ్వీరాజ్, తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి

విద్యారణ్యపురి: జాబ్‌మేళాను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి సూచించారు. డైరెక్టరేట్ ఆఫ్ తెలంగాణ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్, ఆర్డీఎస్‌డీయూ తెలంగాణ సంయుక్త ఆధ్వర్యంలో 2022 – 2025 విద్యా సంవత్సరంలో ఇంటర్ ఒకేషనల్ కోర్సులు పూర్తిచేసిన విద్యార్థులకు హనుమకొండలోని ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో ప్రాంగణంలో అప్రెంటిషిప్ జాబ్‌మేళాను శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో హనుమకొండ డీఐఈఓ గోపాల్, ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ ప్రిన్సిపాల్ చందర్, వరంగల్ ఇంటర్మీడియట్ నోడల్ ఆఫీసర్ మాధవరావు, ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్, ప్రభుత్వ కో ఎడ్యుకేషన్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రెబ్బ శ్రీనివాస్‌రావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ ప్రవీణ్‌కుమార్, డాక్టర్ నవ్వాసి శ్రీనివాస్, అధ్యాపకులు సంపత్, శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్‌లో నోడల్ అధికారి విచారణ

సాక్షి ఎఫెక్ట్..



డీసీఓకు ఇచ్చిన వినతిపత్రాన్ని చూపిస్తున్న రైతు పృథ్వీరాజ్

శాయంపేట : స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకారం పరపతి సంఘం(పీఏసీఎస్)పై మే 27న పంట రుణం మాఫీ చేయిస్తానని మోసం, ఈ నెల 19న పీఏసీఎస్ ఎదుట రైతుల ఆందోళన శీర్షికతో సాక్షిలో ప్రచురితం కాగా స్పందించిన నోడల్ అధికారి రాధిక, పీఏసీఎస్ చైర్మన్ కుసుమ శరత్, వైస్ చైర్మన్ దూదిపాల తిరుపతి రెడ్డిల ఆధ్వర్యంలో ఇన్‌చార్జి కార్యదర్శి పెరుగు శంకర్, రైతు రేణికుంట్ల పృథ్వీరాజ్ మధ్య జరిగిన డబ్బుల లావాదేవిల విషయంపై శుక్రవారం విచారణ చేపట్టినట్లు సమాచారం.

బాధితుడు పృథ్వీరాజ్ కథనం ప్రకారం..

స్థానిక పీఏసీఎస్ కార్యాలయంలో ఉన్న ఇన్‌చార్జ్ కార్యదర్శి పెరుగు శంకర్‌కు తాను ఇచ్చిన మొత్తం రూ.85 వేలకు, రూ.10వేలు, రూ.25వేల ఇచ్చినట్లు సాక్ష్యాలు నిరూపితమయ్యాయి. కాగా రూ. 50వేలకు సాక్ష్యం లేనందున ఇద్దరు తెల్ల కాగితంపై సంతకం చేస్తే సమస్యను పరిష్కరించి నీకు న్యాయం చేస్తామని నోడల్ అధికారి సమక్షంలో పీఏసీఎస్ చైర్మన్, వైస్ చైర్మన్ తెలిపి ఇద్దరితో సంతకాలు తీసుకున్నారు. సంతకాలు తీసుకునే క్రమంలో పృథ్వీరాజ్ తన పట్టాపాస్ పుస్తకం తనకు ఇస్తే తాను రాజీ కుదుర్చుకుంటానని తెలిపారు. పీఏసీఎస్ చైర్మన్, వైస్ చైర్మన్ నోడల్ అధికారి సమక్షంలో రూ. 50 వేలకు సాక్ష్యం లేనందున ఇద్దరు భరించుకోవాలని పట్టా పాస్ బుక్ జూలై 15 లోపు ఇస్తామని తెలిపారు. దీంతో పృథ్వీరాజ్ తన దగ్గర డబ్బులు లేవని నేను కట్టనని చెప్పి బయటకు వెళ్లానని, తా ను డబ్బులు కట్టే పరిస్థితిలో లేనని ఇచ్చిన మొత్తం డబ్బులను పెరుగు శంకర్ కట్టి, తన పట్టా పా స్‌బుక్ తనకు ఇప్పించాలని పృథ్వీరాజ్ కోరుతూ రైతులను మోసగిస్తున్న శంకర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఇదే విషయమై పీఏసీఎస్ ఇన్‌చార్జ్ కార్యదర్శి పెరుగు శంకర్‌ను వివరణ కోసం ఫోన్‌లో సంప్రదించగా స్పందించలేదు.

వ్యాపారులందరూ ట్రేడ్ లైసెన్స్ పొందాలి

- పరకాల మున్సిపల్ కమిషనర్ సుష్మా



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ సుష్మా

పరకాల : స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని వర్తక వ్యాపారస్తులు తప్పకుండా ట్రేడ్ లైసెన్సులు తీసుకోవాలని పరకాల మున్సిపల్ కమిషనర్ కె.సుష్మా కోరారు. మున్సిపల్ కార్యాలయంలో ఆమె స్థానిక వ్యాపారస్తులతో సమావేశమయ్యారు. మున్సిపల్ పరిధిలోని ప్రతీ వ్యాపారి తమ షాపుల పేరిట ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం ఇచ్చిన గెజిట్ ప్రకారం ఆన్‌లైన్ ప్రక్రియ ద్వారా నిర్ణీత వ్యాపార సముదాయం కొలతలు, గెజిట్ రేట్ ప్రకారం ఫీజు ఆన్‌లైన్ క్యూఆర్ కోడ్ ద్వారా చెల్లించి రశీదు పొందాలని కోరారు. గత సంవత్సరం బకాయి కూడా చెల్లించాలని సూచించారు. లైసెన్స్ లేనియెడల మున్సిపల్ చట్టం ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని స్పష్టం చేశారు.

మున్సిపాలిటీలో రాజ్యమేలుతున్న అవినీతి

- అవినీతిని ప్రశ్నించినందుకు మాజీ కౌన్సిలర్‌పై అక్రమ కేసు
- కేసు ఉపసంహరించుకోకపోతే పోరాటం చేస్తాం
- బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ కాళీప్రసాద్‌రావు



మాట్లాడుతున్న డాక్టర్ కాళీప్రసాద్‌రావు

పరకాల: పరకాల మున్సిపాలిటీలో అవినీతి రాజ్యమేలుతుందని..ఓ సామాన్య కుటుంబానికి జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నించినందుకు బీజేపీ మాజీ కౌన్సిలర్ ఆర్‌పీ జయంత్‌లాల్‌పై అక్రమ కేసులతో అధికారులు వేధించడం మానుకోవాలని బీజేపీ పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ పి.కాళీప్రసాద్‌రావు హెచ్చరించారు. బీజేపీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రహరీ విషయంలో పట్టణానికి చెందిన రాజయ్య దంపతులు రెండేళ్లుగా మున్సిపల్ అధికారులకు ఫిర్యాదులు చేశారు. మున్సిపల్ కార్యాలయ స్పెషల్ ఆఫీసర్, జిల్లా అడిషనల్ కలెక్టర్ వెంకట్‌రెడ్డి ఆదేశాల మేరకు గత కమిషనర్ వెంకటేష్ ప్రహరీ తొలగింపు చర్యలు తీసుకున్నారు. ఆ సమయంలో టీపీఓగా సుష్మ కమిషనర్‌గా బాధ్యతలు తీసుకున్న మూడు రోజులకే మళ్లీ ప్రహరీ నిర్మాణానికి అనుమతి ఇవ్వడంపై మాజీ కౌన్సిలర్ జయంత్‌లాల్ అధికారులను కార్యాలయంలో నిలదీయడం జరిగిందని కాళీప్రసాద్‌రావు అన్నారు. కాంగ్రెస్ నాయకుల ప్రోత్సాహంతోనే అధికారులు బీజేపీ మాజీ కౌన్సిలర్‌పై తప్పుడు కేసులు పెట్టి బనాయిస్తే చూస్తు ఊరుకునే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. జయంత్‌లాల్‌పై పెట్టిన అక్రమ కేసును వెనుకకు తీసుకొని పక్షంలో బీజేపీ ఆధ్వర్యంలో పోరాటాలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. జయంత్‌లాల్ మాట్లాడుతూ పదేళ్ల కౌన్సిలర్ పదవిలో ఏనాడు ఏ ఒక్కరి నుంచి పైసలు తీసుకొని పనిచేయలేదని..దమ్ముంటే నిరూపించాలని సవాల్ విసిరారు. సమావేశంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు గాజుల నిరంజన్, మాజీ కౌన్సిలర్లు బెజ్జంకి పూర్ణాచారి, కొలనుపాక భద్రయ్య, మున్సిపల్ మాజీ చైర్మన్ మార్త రాజభద్రయ్య, నాయకులు రాజవీర్, రామన్న, సోమరాజు, శారదా, గోపినాథ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించాలి

- బహుజన సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు సుమన్



మాట్లాడుతున్న సుమన్

శాయంపేట : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించి, కళాశాలకు ప్రహరీ మంజూరు చేయాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావును బహుజన సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు మొగ్గం సుమన్, స్టూడెంట్ యూనియన్ అధ్యక్షుడు మంద సురేశ్‌లు డిమాండ్ చేశారు. కళాశాలను శుక్రవారం వారు సందర్శించి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలకు వచ్చే విద్యార్థులు నిరుపేద కుటుంబాలకు చెందిన వారని, బస్సు సౌకర్యం లేక చాలామంది నిరుపేద విద్యార్థులు కళాశాలకు రాలేక ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. బస్సు సౌకర్యం కల్పిస్తే మండలం చుట్టూ ఉన్న గ్రామాల విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో వచ్చే అవకాశం ఉందని తెలిపారు. నైపుణ్యం కలిగిన అధ్యాపకులు ఉన్నప్పటికీ, కళాశాలలో అన్ని సౌకర్యాలు కల్పించినప్పటికీ బస్సు సౌకర్యం లేక విద్యార్థులు కళాశాలకు రాలేకపోతున్నారని వాపోయారు. విద్యార్థులు అధిక సంఖ్యలో వచ్చి చదువుకునే విధంగా చొరవ తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరారు.

నేడు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ ప్రారంభం

హసన్‌పర్తి: హసన్‌పర్తిలోని సంస్కృతి విహార్‌లో కొత్తగా ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌ను ఏర్పాటు చేస్తున్నారు. శనివారం ఉదయం స్థానిక ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు చేతుల మీదుగా ఈ పోలీస్‌స్టేషన్‌ను ప్రారంభించనున్నారు. ఏడాది క్రితమే ఇక్కడ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌ను మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రెండు నెలల క్రితం ప్రారంభోత్సవానికి ముహూర్తం నిర్ణయించారు. అనివార్య కారణాల వల్ల ప్రారంభోత్సవం వాయిదా పడింది. హనుమకొండ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లోని సగం భాగాన్ని విభజిస్తూ కొత్తగా హసన్‌పర్తి పేరిట ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు కానుంది.